క్లుప్తంగా

పేద మహిళ జీవనోపాధికి ఆటో వితరణ



ఆటోను అందజేస్తున్న సర్దార్‌బాషా తదితరులు

ఒంగోలు అర్బన్: పేద మహిళ జీవనోపాధి కోసం సూర్యశ్రీ ట్రస్టు ఆటో వితరణ చేసింది. ట్రస్టులో పనిచేస్తున్న విజయ అనే మహిళకు స్థానిక ట్రస్టు కార్యాలయంలో ఆటోను అందచేశారు. పేదరికంతో ఇద్దరు బిడ్డలను చదివించుకునేందుకు, కుటుంబ పోషణకు ఇబ్బందుల లేకుండా ఉండేలా దాత సహకారంతో చేయూతనందించారు. కార్యక్రమంలో ట్రస్టు సెక్రటరీ సర్దార్‌బాషా, షహనాజ్, మరియమ్మ, మారెళ్ల సుబ్బారావు, మండవ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న మహిళలు

ఒంగోలు మెట్రో: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక మహిళాభ్యుదయ సమితి కార్యాలయంలోని శక్తి సదన్‌లో శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో మహిళలకు పరీక్షలు చేసి తగిన సలహాలు, సూచనలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రముఖ మహిళా వైద్యులు జనరల్ సర్జన్ డాక్టర్ ఎండ్లూరి జెరూషా జాస్మిన్, గైనకాలజిస్ట్ డాక్టర్ చాపల శాంతకుమారి, దంత వైద్యురాలు డాక్టర్ సరయు, సిబ్బంది పాల్గొన్నారు.

మన్నం ట్రస్ట్ సేవలు అభినందనీయం



మహిళలకు గ్రైండర్లు అందిస్తున్న మన్నం శ్రీధర్, డాక్టర్ జవహర్

చీమకుర్తి: మన్నం సుబ్బారావు ట్రస్ట్ తరఫున వైఎస్సార్ సీపీ నాయకుడు మన్నం శ్రీధర్ అందిస్తున్న సేవలు అభినందనీయమని లయన్స్ క్లబ్ వ్యవస్థాపకుడు డాక్టర్ బీ జవహర్ అన్నారు. మన్నం సుబ్బారావు వర్ధంతి సందర్భంగా మన్నం శ్రీధర్ శనివారం చీమకుర్తిలోని బధిరుల పాఠశాల విద్యార్థులకు రూ.40 వేల విలువైన కంప్యూటర్, పేదలకు గ్రైండర్లు, తోపుడు బండి అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ బీ జవహర్ మాట్లాడుతూ మన్నం శ్రీధర్ తన తండ్రి వర్ధంతిని పురస్కరించుకుని గత 21 సంవత్సరాలుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ప్రశంసించారు. మన్నం శ్రీధర్ మాట్లాడుతూ తన తండ్రి జ్ఞాపకార్థం బధిరుల పాఠశాలలోని విద్యార్థులకు, పేదలకు సేవలందించడం సంతృప్తినిచ్చిందన్నారు. కార్యక్రమంలో చలువాది రమేష్, కరస్పాండెంట్ అంజిరెడ్డి, హనుమంతరావు, స్థానికులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 1,444 మంది గైర్హాజరు

ఒంగోలు: జూనియర్ ఇంటర్ పరీక్షకు జిల్లాలో శనివారం 1444 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. గణితం 1బీ, జువాలజీ, హిస్టరీ పరీక్షలు జరిగాయి. జనరల్ విభాగంలో 19,288 మందికిగానూ 18,295 మంది, ఒకేషనల్ విభాగంలో 2,702 మందికిగానూ 2,251 మంది హాజరయ్యారు. ఆర్‌ఐవో 5 సెంటర్లు, డీఈసీ సభ్యులు, డీఐఈవో 5 సెంటర్లు, స్క్వాడ్ బృందాలు 35 సెంటర్లు వెరసి 45 సెంటర్లను అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్ష పూర్తిగా ప్రశాంతంగా జరిగిందని ఆర్‌ఐవో ఎ.సైమన్ విక్టర్ తెలిపారు.

కనులపండువగా అమరలింగేశ్వరుని కల్యాణం

ఉలవపాడు: మండల పరిధిలోని మన్నేటికోటలో వెలసిన గంగా పార్వతీ సమేత అమరలింగేశ్వరస్వామి కల్యాణం శనివారం కనులపండువగా సాగింది. మహాశివరాత్రి పర్వదినం తరువాత లింగోద్భవ పూజల అనంతరం కల్యాణం నిర్వహించారు. అమరలింగేశ్వరుని ప్రత్యేక పూజలు చేసిన అనంతరం గంగా పార్వతీ దేవి సమేత అమరలింగేశ్వరునికి భక్తుల అనుమతితో తాళిబొట్టు కట్టారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య కళ్యాణం నిర్వహించారు.

ఆధునిక నగరంగా తీర్చిదిద్దుతాం

- మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి
- నగరంలో రూ.2.58 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: నగరంలోని 20వ డివిజన్‌లో రూ.2.58 కోట్ల విలువైన అభివృద్ధి పనులను మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి శనివారం రాత్రి ప్రారంభించారు. రూ.38 లక్షలతో నిర్మించిన పార్కు, మౌలిక సౌకర్యాలు, మరో రూ.2 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం, రూ.20 లక్షలతో చిన్న పార్కు ప్రహరీ పనులు పూర్తి కావడంతో బాలినేని వాటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ నగరాభివృద్ధి పనులు ప్రస్తుత పాలకవర్గంలో బాగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. త్వరలోనే మరిన్ని సౌకర్యాలు కల్పించి ఆధునిక నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో 20వ డివిజన్ కార్పొరేటర్ పసుపులేటి విజయలక్ష్మి శ్రీనివాసరావు, పీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ మేదరమెట్ల శంకరారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మోదుబోయిన సురేష్‌యాదవ్, దూళిపూడి ప్రసాద్‌నాయుడు, దీఈ పద్మజ, వైఎస్సార్‌సీపీ నాయకులు తన్నీరు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హాకీ ఫైనల్స్‌కు కాకినాడ-అనకాపల్లి జట్లు



క్రీడాకారిణులను అభినందిస్తున్న మారం వెంకారెడ్డి

చీమకుర్తి: రాష్ట్రస్థాయి 14వ సీనియర్ మహిళల హాకీ పోటీల్లో కాకినాడ–అనకాపల్లి జిల్లాలకు చెందిన జట్లు ఫైనల్స్‌కు చేరుకున్నాయి. సంతనూతలపాడు మండలం మైనంపాడు ప్రభుత్వ హైస్కూల్లో జరుగుతున్న రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో రెండో రోజైన శనివారం సెమీఫైనల్స్ నిర్వహించగా, పలు జట్లు తలపడ్డాయి. మొదటి సెమీఫైనల్‌లో సత్యసాయి జిల్లా, కాకినాడ జిల్లా జట్లు పోటీపడగా 2 గోల్స్ చేసి కాకినాడ జిల్లా జట్టు ఫైనల్స్‌కు చేరుకుంది. రెండో సెమీఫైనల్‌లో అనకాపల్లి, విశాఖపట్నం జిల్లా జట్లు పోటీపడగా అనకాపల్లి జట్టు ఒక గోల్ చేసి విజేతగా నిలిచి ఫైనల్స్‌కు చేరుకుంది. ఫైనల్స్‌కు చేరుకున్న కాకినాడ – అనకాపల్లి జిల్లాల జట్లు ఆదివారం ఉదయం పోటీపడనున్నాయి. పోటీల నిర్వహణకు ఆర్థికంగా సహకరించిన వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ పరిశీలకుడు మారం వెంకారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ఫైనల్స్‌కు చేరుకున్న రెండు జట్ల క్రీడాకారిణిలను అభినందించారు. అనంతరం మారం వెంకారెడ్డిని హాకీ అసోసియేషన్ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హాకీ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హర్షవర్ధన్, జిల్లా సెక్రటరీ సుందరరామిరెడ్డి, జ్ఞానేశ్వరరెడ్డి, టీ రవి, చెరుకూరి రఘుకిరణ్, మన్నం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలి

- హైకోర్టు జస్టిస్ మన్మథరావు



సింగరాయకొండలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న జస్టిస్ మన్మథరావు

సింగరాయకొండ (మర్రిపూడి): నేటి ఆధునిక సమాజంలో తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల బాధ్యతగా వ్యవహరించినప్పుడే వారు ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని హైకోర్టు జస్టిస్ కె. మన్మథరావు ఆశాభావం వ్యక్తం చేశారు. సింగరాయకొండ మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో గల ఆర్యవైశ్య కల్యాణ మండపంలో శనివారం రాత్రి పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నేటి విద్యా వ్యవస్థ–సవాళ్లు అన్న అంశంపై జరిగిన సదస్సులో మాట్లాడారు. నేటి విద్యార్థులు సెల్‌ఫోన్ మోజులో పడి పెడదారులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలు బాగా చదువుతున్నారా లేదా అని కనీస బాధ్యతగా పిల్లల నడవడికపై దృష్టి పెట్టాలని సూచించారు. మనం ఎంతసేపటికీ ప్రభుత్వ విధానాలు– ప్రభుత్వ పనితీరు కారణంగా విద్యావ్యవస్థ బాగా లేదని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. తాను 30 ఏళ్లుగా న్యాయవాద వృత్తిలో ఉన్నానని ఆసమయంలో జనవిజ్ఞానవేదిక, వినియోగదారుల సేవా చట్టం, సంపూర్ణ మద్య నిషేధం వంటి కార్యక్రమాల్లో పాల్గొన్నానని సమాజాన్ని చాలా దగ్గరగా చూశానన్నారు. నేడు న్యాయమూర్తిగా తీర్పుఇవ్వటానికి గత అనుభవాలు తనకు దోహద పడుతున్నాయని రెండేళ్లలోనే సుమారు 4,800 తీర్పులు ఇచ్చానని వివరించారు. ఈ సందర్భంగా జస్టిస్ మన్మథరావును పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. డాక్టర్ నూకసాని సుబ్బారావు, బాలకోటయ్య, నిరుపమ, సన్నెబోయిన శ్రీనివాసులు, జి. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి ఆర్యవైశ్య యువత

- కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన యువనేత బాలినేని ప్రణీత్‌రెడ్డి



ఆర్యవైశ్య యువతకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బాలినేని ప్రణీత్‌రెడ్డి

ఒంగోలు: ఆర్యవైశ్య యువత పలువురు వైఎస్సార్ సీపీలోకి చేరారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం స్థానిక బాలినేని నివాసానికి వారు చేరుకున్నారు. ఈ సందర్భంగా వారిని వైఎస్సార్ సీపీ యువనేత బాలినేని ప్రణీత్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్యవైశ్యుల్లో కూడా 60 శాతం మందికి పైగా పేదరికం అనుభవిస్తున్నారన్నారు. గతంలో ఎటువంటి ఆర్థిక ప్రయోజనం చేకూరేది కాదని, కానీ నేడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రతి పేద కుటుంబానికి ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందన్నారు. బాలినేని ప్రణీత్‌రెడ్డి మాట్లాడుతూ యువత కేవలం తాము అవగాహన పొందడమే కాకుండా ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. శత్రువులు అంతా ఒక్కటై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, దీన్ని తిప్పికొట్టాలంటే యువత నడుం బిగించి బాధ్యతాయుతంగా వ్యవహరించడం ఒక్కటే మార్గమన్నారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్ మాట్లాడుతూ ఆర్యవైశ్యులకు బాలినేని నేతృత్వంలో ప్రతి ఒక్కరికీ ప్రయోజనం చేకూరిందన్నారు. పేదలు సంతోషంగా ఉంటేనే వ్యాపారాభివృద్ధి జరుగుతుందని, పేదలకు ఆర్థిక ప్రయోజనాలను ప్రభుత్వం అందిస్తుంటే వారు తమ కనీస అవసరాలను తీర్చుకునే సౌలభ్యం ఉండడంతో నేడు ఇతర రాష్ట్రాలకన్నా మన రాష్ట్రం ఆదాయంలో గణనీయంగా పెరుగుదల కనిపించిందన్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారిలో శిఖాకొల్లి భరత్‌కుమార్, చీదెళ్ల వెంకట రోహిత్, వేద వ్యాస, చక్కా మహేష్, కొమ్మిశెట్టి రవితేజ, కటకం యశ్వంత్, కటకం శివసాయి, పొదర్తి వంశీ, పచ్చిపులుసు సాయి, నంద, కృష్ణ , శిఖాకొల్లి అనీల్‌కుమార్ ఉన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కుప్పం ప్రసాద్, జయకృష్ణ, వేమూరి గణేష్, మట్టా హర్ష, పోతూరి కళ్యాణ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా వాలీబాల్ టోర్నమెంట్



హోరాహోరీగా తలపడుతున్న క్రీడాకారులు



బ్లాకింగ్‌లో ప్రతిభ కనబరుస్తున్న ప్రకాశం జట్టు

ఒంగోలు రూరల్: మండలంలోని కరవదిలో హనుమంతరావు స్మారక ఇన్విటేషన్ వాలీబాల్ టోర్నమెంట్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. శనివారం సాయంత్రం 5 గంటల నుంచి పోటీలు ప్రారంభం కాగా హనుమంతరావు మాష్టారు, పూర్వ విద్యార్థులు, జాతీయ, రాష్ట్ర పూర్వ క్రీడాకారులు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి క్రీడాకారులు పోటీల్లో పాల్గొనేందుకు వచ్చారు. తొలి రోజు ప్రకాశం–గుంటూరు మధ్య పోటీ జరగా ప్రకాశం 14–15 తేడాతో విజయం సాధించింది. కృష్ణ–ప్రకాశం మధ్య పోటీ జరగ్గా బెస్ట్ ఆఫ్ ఫై మ్యాచ్‌లు జరిగాయి. ప్రకాశం జట్టు 3,2 స్కోరుతో విజయం సాధించింది. అనంతరం వైజాగ్–కృష్ణ మధ్య పోటీ ప్రారంభమయింది. ప్రతి పాయింట్ కోసం క్రీడాకారులు తీవ్రంగా చెమటోడాల్సిన పరిస్థితి కనిపించింది. ప్రకాశం, కృష్ణ జట్లు యటాకింగ్, బ్లాకింగ్, డ్రాపింగ్‌లో విశేష ప్రతిభ కనబరిచారు. పోటీలకు అంపైర్లుగా నాగేశ్వరరావు, భరత్‌కుమార్, రాధకృష్ణ, ప్రేమ్ వ్యవహరించారు.

కమనీయం శివపార్వతుల పరిణయం



నగరోత్సవంలో దేవస్థానం ధర్మకర్తలు, భక్తులు



మదనూరులో రామలింగేశ్వరస్వామి, కన్నేశ్వరస్వామి కల్యాణోత్సవం



స్వామి అమ్మవార్ల కళ్యాణంలో వేద పురోహితులు భక్తులు

ఒంగోలు మెట్రో: మహాశివరాత్రి పురస్కరించుకొని ప్రకాశం జిల్లా వ్యాప్తంగా శైవ కల్యాణం కమనీయం శివపార్వతుల పరిణయంక్షేత్రాల్లో శనివారం శివపార్వతుల కళ్యాణాన్ని ఆలయ నిర్వాహకులు వైభవంగా నిర్వహించారు. స్థానిక సంతపేట షిరిడీ సాయిబాబా మందిరంలో బ్రహ్మశ్రీ మతంపల్లి దక్షిణామూర్తి ఆధ్వర్యంలో శివపార్వతుల కళ్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. కేశవ్ స్వామి పేటలోని విజయ్ దుర్గ అమ్మవారి ఆలయం దగ్గర ప్రముఖ వేద పురోహితులు వేద సాయి ఆధ్వర్యంలో , చూడు నీకు కొత్తపట్నం బస్టాండ్ దగ్గర తూర్పుపాలెం శివాలయంలో , మంగమూరు రోడ్డులోని సత్య సాయి బాబా మందిరంలో వేద పురోహితులు వ్యామజాల ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో మందిరం వివిధ రకాల పూలతో చక్కగా మండపంలో వధూవరులైన శివపార్వతులను అలంకరించి కళ్యాణ క్రతువును వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి అమ్మవార్ల కళ్యాణాన్ని తిలకించి స్వామి అమ్మవార్ల ఆశీస్సులను అందుకున్నారు.



పంచముఖ శివాలయంలో శివలింగానికి అన్నాభిషేకం

శివయ్యకు అన్నాభిషేకం

ఒంగోలు అర్బన్: మహా శివరాత్రి సందర్భంగా శుక్రవారం రాత్రి జాగరణ నేపథ్యంలో స్థానిక అంజయ్య రోడ్డులోని ఉమామహేశ్వర సమేత పంచముఖ శివాలయంలో శివుడికి విశేషంగా అన్నాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు నిడుబ్రోలు కోటేశ్వరశర్మ ఆధ్వర్యంలో నార్నెపాటి మహేష్, సుబ్బరామశాస్త్రి ఇతర అర్చకుల బృందంతో కనులవిందుగా అన్నాభిషేకంతో పాటు పంచామృత అభిషేకం నిర్వహించారు. రాత్రి జాగరం సందర్భంగా ప్రధాన అర్చకులు అభిషేకాలతో పాటు ప్రవచనాలు, భజనలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం శివనామంతో మార్మోగింది. కార్యక్రమాలకు భారీగా భక్తులు హాజరై తెల్లవారే వరకు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ ట్రస్టీ లక్కవరపు లక్ష్మీనారాయణ పర్యవేక్షించారు.



శివపార్వతుల వేషధాలు కళాకారులు

కనులపండువగా నగరోత్సవం

ఒంగోలు మెట్రో: మహాశివరాత్రి పండుగను పురస్కరించుకొని స్థానిక కేశవస్వామిపేటలో వేంచేసి ఉన్న కాశీ విశ్వేశ్వర స్వామి నగరోత్సవం శనివారం సాయంత్రం కనులపండువగా సాగింది. స్వామి నర నంది వాహనంపై నగరంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో చైర్మన్ ఈదుపల్లి గురునాథరావు, కార్యనిర్వహణాధికారి డి.రజనీకుమారి, ధర్మకర్తల మండలి సభ్యులు కుర్రా ప్రసాద్‌బాబు, నెమ్మని హరిప్రియాదేవి, ఉత్సవ ఉభయదాతలు భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణోత్సవం

కొత్తపట్నం: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మదనూరులో రామలింగేశ్వర స్వామి, కన్నేశ్వర స్వామి కల్యాణోత్సవం, కొత్తపట్నంలో నాగేశ్వర స్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణం కనులపండువగా సాగాయి. స్థానిక నాగేశ్వర స్వామి ఆలయంలో శనివారం వేకువజామున కళ్యాణోత్సవం వైభవంగా సాగింది. గ్రామ పెద్దలు, ఈఓరమణారావు ఆధ్వర్యంలో రామలింగేశ్వరస్వామి, కన్నేశ్వరస్వామిలకు పూజలు చేసి కల్యాణోత్సవం నిర్వహించారు. ఈఓ సుబ్రహ్మణ్యం, ఆలయ చైర్మన్ పురిణి రామలింగారెడ్డి ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణం కనులపండువగా సాగింది. ఓం నవ శివాయ..హరహర మహాదేవ..శంభో శంకర నామంతో ఆలయం మార్మోగింది. కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. పూజల అన,తరం భక్తులు సముద్ర స్నానాలు చేసి ఆలయానికి వచ్చి దర్శనం చేసుకున్నారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పాటకచేరి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటుచేశారు. భక్తులకు అన్నదానం చేశారు.